ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి
5
మెదక్
జిల్లాల వార్తలు
బుధవారం 19 మార్చి 2025



దంపుయార్డుకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న ప్రజలు (ఫైల్)

అసలేం జరుగుతోంది..!

ప్యారానగర్‌పై ప్రభుత్వ అడుగులు ఎటు

42 రోజులుగా ఆగని ప్రజల నిరసనలు

గుట్టుగా పనులు చేస్తున్నారంటూ ఆగ్రహం

7

'పది' పరీక్షలకు

సర్వం సిద్ధం

ఎల్లుండి నుంచి పరీక్షలు

సంగారెడ్డి జిల్లాలో 122 పరీక్షా కేంద్రాలు, 22,423 మంది విద్యార్థులు

మెదక్ జిల్లాలో 68 కేంద్రాలు, 10,387 మంది...

మెదక్ అర్బన్/సంగారెడ్డి అర్బన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్టు సంగారెడ్డి జిల్లా డీఈవో ఎస్.వెంకటేశ్వర్లు, మెదక్ డీఈవో రాధాకిషన్ వేర్వేరుగా తెలిపారు. ఈ నెల 21వ తేదీ నుంచి ఏప్రిల్ 3 వరకు నిర్వహించే పరీక్షల కోసం సంగారెడ్డి జిల్లాలో 122 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 22,423 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు 122 సిట్టింగ్ స్క్వాడ్స్, 6 ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్స్ ఏర్పాటు చేశారు. మెదక్ జిల్లాలో 68 కేంద్రాల్లో 10,387 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. పరీక్షల నిర్వహణకు 3 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 16 సిట్టింగ్ స్క్వాడ్, కస్టోడియన్ బృందాలు, 500 మంది ఇన్విజిలేటర్లను ఏర్పాటు చేశారు.

సెంటర్ల వద్ద 144 సెక్షన్

ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. పరీక్ష సమయంలో సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసివేయబడతాయి. పరీక్ష కేంద్రాల్లోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు. ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద సంబంధిత మండల విద్యాధికారి, డీఈవో, తహసీల్దార్, ఎంపీడీవో, మండల వైద్యశాఖ అధికారి మొబైల్ నంబర్లు ప్రదర్శించాలని సంబంధిత చీఫ్ సూపరింటెండెంట్లకు ఉన్నతాధికారులు ఆదేశించారు. 9.35 గంటల వరకు మాత్రమే కేంద్రాల్లోకి అనుమతిస్తారు. సందేహాల నివృత్తి కోసం సంగారెడ్డి విద్యార్థులు 08455-276255, 8919677495 నంబర్లను, మెదక్ జిల్లా విద్యార్థులు 949167647 నంబర్‌ను సంప్రదించాలని డీఈవోలు తెలిపారు.

భట్టి బడ్జెట్‌పై బోలెడు ఆశలు



నిధుల కోసం మెతుకుసీమ ఎదురుచూపు

సాగునీటి కేటాయింపులపై సర్వత్రా ఆసక్తి

భూనిర్వాసితుల పరిహారం,

రిజర్వాయర్ల కాలువలకు సొమ్ము అవసరం

సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులకు దక్కేనా

అధ్వాన రహదారులకు మోక్షం లభించేనా?

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మార్చి18 : ఓ వైపు మల్లన్నసాగర్, రంగనాయకసాగర్, కొండపోచమ్మసాగర్, గౌరవెల్లి రిజర్వాయర్ల కాలువల నిర్మాణం.. భూనిర్వాసితులకు పరిహారం.. మరోవైపు రూ.4లక్షల ఎకరాలకు నీరందించే సంగమేశ్వర, బసవేశ్వర సాగునీటి ప్రాజెక్టుల నత్తనడక.. ఇంకోవైపు విద్య, వైద్య రంగాల్లో అనిశ్చితి, మరమ్మతులకు గురైన రహదారులు, పెండింగ్‌లో కొత్త రోడ్లు.. అదే విధంగా చేర్యాల, దుబ్బాక, రామాయంపేట, పటాన్‌చెరు రెవెన్యూ డివిజన్ల ఏర్పాటులో జాప్యం.. వీటితోపాటు పంపిణీకి నోచక శిథిలావస్థకు చేరుతున్న డబుల్ బెడ్రూం ఇళ్లు.. గత ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై సందిగ్ధత.. మెతుకుసీమ దశ, దిశ మార్చేలా కొత్త ప్రాజెక్టుల కోసం ఎదురుచూపు... ఇవన్నీ



అసంపూర్తిగా పంట కాలువ పనులు

ప్రస్తుతం ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా వేధిస్తున్న సమస్యలు. వీటన్నింటిని అధిగమించాలంటే సరిపడా నిధులు అవసరం. ఆ నిధుల కేటాయింపుతోనే ఈ ప్రాంత భవిష్యత్తు ఆధారపడి ఉంది. నేడు డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పై మెతుకుసీమ ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.

సాగునీటి వనరులకు మోక్షం కలిగేనా

వేసవి మొదట్లోనే సాగునీటి కోసం ఉమ్మడి మెదక్ జిల్లా రైతాంగం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పొట్ట దశకు వచ్చిన వరిపొలాలను రక్షించుకోవడానికి నానా ప్రయత్నాలు చేస్తున్న పరిస్థితి నిత్యం కనిపిస్తోంది. కాగా కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, గౌరవెల్లి రిజర్వాయర్లను గత ప్రభుత్వ హయాంలో నిర్మించారు. ప్రస్తుతం గోదావరి జలాలను ఎత్తిపోస్తున్నారు. ఈ రిజర్వాయర్ల నుంచి చెరువులు, ఆయకట్టు భూముల దాకా కాలువలను నిర్మించాల్సి ఉంది. తద్వారా సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, సంగారెడ్డి, నర్సాపూర్, మెదక్ నియోజకవర్గాలకు నీటిని తరలించే అవకాశం ఉంటుంది. కానీ ఇప్పటివరకు కాలువల నిర్మాణానికి నిధులు విడుదల చేయడం లేదు. అదే విధంగా మల్లన్నసాగర్ భూనిర్వాసితులకు ఇంకా పూర్తి పరిహారం అందలేదు. నిర్వాసిత కాలనీల్లోనూ తీవ్రమైన సమస్యలు నెలకొన్నాయి. మల్లన్నసాగర్ నుంచి తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు చేపట్టిన కాలువ పనులను నిలిపివేశారు. వీటికి తోడు సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్, నారాయణఖేడ్, అందోల్, సంగారెడ్డి నియోజకవర్గాలకు సాగునీటిని అందించడానికి చేపట్టిన సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులను గాడిన పెట్టాల్సిన

మిగతా 7వ పేజీలో



పోక్సో, అత్యాచార

బాధితుల్లో ధైర్యాన్ని నింపండి

భరోసా కేంద్రం సిబ్బంది సేవలు భేష్

సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్



భరోసా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎస్పీ పంకజ్

సంగారెడ్డి క్రైం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : పోక్సో అత్యాచార కేసుల్లో బాధితుల్లో ధైర్యాన్ని నింపాలని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. సంగారెడ్డిలోని భరోసా కేంద్రాన్ని మంగళవారం నాడాయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భరోసా కార్యాలయంలో కౌన్సెలింగ్ రూమ్, మెడికల్ రూమ్, లీగల్‌సపోర్ట్ రూమ్, వీడియో కాన్ఫరెన్స్ రూమ్‌ను పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. భరోసా కేంద్రం ప్రారంభమైన నాటి నుంచి పోక్సో, అత్యాచార కేసులలో బాధిత మహిళలకు అందించిన సేవలను, అవగాహన కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ పోక్సో, అత్యాచార, మహిళా సంబంధిత కేసుల్లో బాధితుల వెన్నంటి ఉండి మెడికో లీగల్ సేవలు సత్వరమే అందేలా చూడాలని సూచించారు. మహిళా సంబంధిత నేరాలపై విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. భరోసా సిబ్బంది పనితీరు బాగుందని అభినందించారు. వారికి ఎలాంటి సమస్యలున్నా నేరుగా తనదృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎస్పీ వెంట పట్టణ సీఐ రమేష్, భరోసా కోఆర్డినేటర్ దేవలక్ష్మి ఉన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:32 (బుధవారం సాయంత్రం)

సహర్: 4:59 (గురువారం ఉదయం)

ఉల్లం'ఘనులు'

నిబంధనలు పాటించని వాహనచోదకులు

- మద్యం మత్తులో రయ్‌రయ్..
- 'సెల్'మోహనరంగలతో తస్మాత్ జాగ్రత్త
- ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనచోదకులు
- ఇష్టారాజ్యంగా వ్యవహారం
- పోలీసులకు చిక్కకుండా జిమ్మిక్కులు
- శిరస్త్రాణం.. రక్షించు ప్రాణం
- పోలీసుల విస్తృత తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు

సంగారెడ్డి క్రైం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. వేగం కన్నా గమ్యస్థానం చేరడం ముఖ్యమని పోలీసులు పదేపదే హెచ్చరిస్తున్నా పట్టించుకోవడం లేదు. పత్రాలు లేకుండానే వాహనాలతో రోడ్డెక్కేవారు కొందరైతే.. సెల్‌ఫోన్ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలను నడిపేవారు మరికొందరు. డ్రైవింగ్ లైసెన్సు, ఆర్సీ బుక్ దగ్గర పెట్టుకోకపోగా.. బైక్‌పై వెళ్లేవారు కనీసం హెల్మెట్ కూడా ధరించడం లేదు. ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు చేసి జరిమానాలు విధిస్తున్నా వెనక్కి తతగ్గడం లేదు.

హెల్మెట్‌పై నిర్లక్ష్యం

ద్విచక్రవాహనం నడిపేవారితోపాటు వెనుక కూర్చున్నవారు కూడా హెల్మెట్ పెట్టుకోవాలని నిబంధనలున్నాయి. కానీ జిల్లాలో బైకిస్టులు 90 శాతం మంది హెల్మెట్ లేకుండానే నడుపుతున్నారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా హెల్మెట్ ధరించకపోవడం వల్లనే ప్రాణాలు కోల్పోతున్నట్టు పోలీసుల విచారణలో వెల్లడవుతోంది. అనేకమంది ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ కిందపడటమో, ఇతరులకు ఢీకొట్టడమో జరిగి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ ప్రాణాలు కాపాడుతుందని పోలీసులు అనేక అవగాహన కార్యక్రమాల్లో వివరిస్తున్నా చోదకుల్లో మాత్రం మార్పు రావడంలేదు.

చెవిలో ఫోన్.. చేత్తో డ్రైవింగ్

బైక్ డ్రైవింగ్ చేస్తున్న సమయంలో సెల్‌ఫోన్‌లో మాట్లాడటం

మిగతా 8వ పేజీలో

జిల్లాలో వాహన తనిఖీలు, జరిమానాలు

సంవత్సరం	కేసులు	జరిమానాలు
2022	2,89,244	12,11,68,987
2023	2,44,593	9,59,53,273
2024	1,94,888	7,78,47,962

డ్రంకెన్ డ్రైవ్ కేసులు, జరిమానాలు, శిక్షలు

సంవత్సరం	కేసులు	జరిమానాలు	జైలు శిక్ష
2022	6,369	69,42,795	50
2023	11,404	1,15,55,200	39
2024	8,676	1,13,50,293	65

కఠిన చర్యలు

వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రయాణం సురక్షితంగా జరుగుతుంది. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లనే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడితే జరిమానాతో పాటు జైలు శిక్ష పడే అవకాశం ఉంటుంది. వాహనాలు నడిపే సమయంలో అన్ని పత్రాలు దగ్గరపెట్టుకోవాలి. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. వేగం కంటే గమ్యం చేరడమే ముఖ్యమని గుర్తించాలి. నిబంధనలు ఉల్లంఘించేవారిని కట్టడి చేయడం కోసం పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు.

-కె.సత్తయ్యగౌడ్, డీఎస్పీ



సంగారెడ్డిలో ద్విచక్రవాహనాల తనిఖీ నిర్వహిస్తున్న పోలీసులు (ఫైల్)

మత్తులో వాహనాల డ్రైవింగ్

డ్రంకెన్‌డ్రైవ్ నేరమని తెలిసినా చాలామంది మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నారు. మద్యం మత్తులో అతివేగంగా నడపడంతో ప్రమాదాల బారినపడటమేకాకుండా ఇతరులకూ ప్రాణాంతకంగా మారుతున్నారు. డ్రంకెన్‌డ్రైవ్ కేసుల్లో పట్టుబడుతున్నవారి సంఖ్య ప్రతీ సంవత్సరం పెరుగుతూనే ఉంది. పోలీసులు కౌన్సిలింగ్ ఇస్తున్నా మార్పు రావడం లేదు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై పోలీసులు 2022లో 6,369 కేసులు నమోదు చేసి రూ.69,42,795 జరిమానాలు విధించారు. ఇందులో 50 మందికి జైలు శిక్ష కూడా విధించారు. అలాగే 2023లో 11,404 కేసులు నమోదు చేయగా 1,15,55,200 జరిమానా విధించి, 39 మందిని జైలుకు పంపారు. అలాగే 2024లో 8,676 కేసుల్లో రూ. 1,13,50,293 జరిమానా విధించడంతోపాటు 65 మందిని జైలుకు పంపించారు.



ఎంపీ రఘునందన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తప్పుడు డాక్యుమెంట్లతో డంపుయార్డుకు అనుమతి

కేంద్ర అటవీశాఖ డైరెక్టర్ ఆఫ్ జనరల్‌కు మెదక్ ఎంపీ రఘునందన్ వినతి

నర్సాపూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం తప్పుడు డాక్యుమెంట్లతో అటవీశాఖకు నివేదిక ఇచ్చి డంపుయార్డు ఏర్పాటుకు అనుమతి తీసుకున్నారని, దీనిపై సమగ్ర విచారణ జరిపించి ప్రస్తుతం చేపట్టిన నిర్మాణం నిలిపివేయాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఆధ్వర్యంలో నాయకులు కేంద్ర అటవీశాఖ డైరెక్టర్ జనరల్‌కు వినతిపత్రం అందజేశారు. ఎంపీతో పాటు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్‌యాదవ్, గుమ్మడిదల మండల నాయకులు గోవర్ధన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఉదయ్, రైతు సంఘం నాయకుడు సదానందరెడ్డి, బాల్‌రెడ్డి, జోగినాథ్ తదితరులు మంగళవారం డిల్లీలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ ఇచ్చిన వినతిపత్రంలో గుమ్మడిదల మండలం నల్లవల్లి ప్రాంతంలో కేటాయించిన 152 ఎకరాల భూమి ప్రభుత్వానిదో లేక అటవీశాఖకు చెందినదో కాదని పేర్కొన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తప్పుడు డాక్యుమెంట్లతో డంపుయార్డుకు కేంద్ర అటవీశాఖ నుంచి అనుమతి తీసుకున్నదని ఆరోపించారు. డంపుయార్డుకు స్థలం కేటాయించే సమయంలో స్థానికుల అభిప్రాయం కూడా తీసుకోలేదని విమర్శించారు. ఆర్వోఎఫ్ఆర్ యాక్టు ఎక్కడా పాటించకుండా భూమి కేటాయించారని పేర్కొన్నారు. ఈ చట్టం ప్రకారం గిరిజన సర్పంచులను స్థానికులను కమిటీలో నియమించాల్సి ఉండగా ఈ ప్రాంతానికి సంబంధంలేని ఇతర ప్రాంత సర్పంచులను నియమించి సంతకాలు తీసుకుని మోసం చేశారని ఆరోపించారు. కేటాయింపు అక్రమమే కాకుండా పక్కనే అటవీ ప్రాంతం ఉండటంతో అటవీ సంపద నాశనమయ్యే అవకాశమున్నందున డంపుయార్డు స్థలం విషయంలో పునరాలోచించి తగిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. బుధవారం కేంద్ర అటవీశాఖ మంత్రిని కూడా కలిసి వినతిపత్రం అందజేస్తామని ఎంపీ, నాయకులు పేర్కొన్నారు.



మెదక్ కలెక్టర్ పొలంబాట

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పొలం బాటపట్టారు. రామాయంపేట మండలంలో మంగళవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. మున్సిపల్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ ప్రక్రియను పరిశీలించారు. పట్టణంలో తిరిగి తాగునీటి సరఫరా వివరాలు సేకరించారు. పట్టణ శివార్లలో వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. జిల్లాలో రెండు లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా పొలాలన్నీ పచ్చగా ఉన్నాయని పేర్కొన్నారు.

-రామాయంపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి)

ఎల్‌ఈడీ పార్క్‌కు దారేదీ?

శివానగర్‌లో 105 ఎకరాల్లో ఏర్పాటు

రూ. 1.50 కోట్లకు ఎకరా చొప్పున ఎంఎస్ఎంఈ యూనిట్లకు కేటాయింపు

ఇప్పటికే 110 ప్లాట్ల విక్రయం

10 పరిశ్రమల గ్రౌండింగ్.. నిర్మాణంలో మరికొన్ని..

రోడ్డు, సదుపాయాలు లేక పరిశ్రమల ఏర్పాటుకు వెనుకంజ





ఎల్‌ఈడీ పార్క్ వెళ్లేందుకు మట్టి రోడ్డు

జిన్నారం, మార్చి, 18 (ఆంధ్రజ్యోతి): శివానగర్‌లో ఎల్‌ఈడీ పార్కు ఏర్పాటు చేసి ఎనిమిదేళ్లు మౌలిక వసతులు ఏర్పాటు చేయలేదు. కనీసం రోడ్డు కూడా లేకపోవడంతో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావడం లేదు. సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం శివానగర్ గ్రామంలో 2016లో ఎల్‌ఈడీ బల్బుల తయారీ కోసం ప్రత్యేకంగా పరిశ్రమల సమూహం ఏర్పాటుచేశారు. సర్వే నంబర్ 114లోని 125 ఎకరాల అసైన్డ్ భూములను అప్పట్లో టీఎస్ఐఐసీ ద్వారా సేకరించారు. ఆరేళ్ల పాటు అభివృద్ధి పనులు కొనసాగాయి. అంతర్గత రహదారులు, విద్యుత్ సబ్‌స్టేషన్, వీధి లైట్లు ఏర్పాటు చేశారు. రహదారులను మినహాయించి 105 ఎకరాల్లో 110 ప్లాట్లను ఏర్పాటు చేశారు. ఎంఎస్ఎంఈ యూనిట్లను ఏర్పాటు చేసేవారికి ఎకరా రూ.1.50 కోట్ల చొప్పున కేటాయించారు. ఎల్‌ఈడీ బల్బుల తయారీ యూనిట్ల కోసం 58.5 ఎకరాలు, ఇతర పరిశ్రమల కోసం 46.5 ఎకరాలను కేటాయించారు. ఇప్పటి వరకు 10 యూనిట్ల గ్రౌండింగ్ పూర్తయ్యింది. మరో 4 నిర్మాణ దశలో ఉన్నాయి.

దారి లేక నేరవేరని లక్ష్యం

పారిశ్రామికవాడకు వెళ్లేందుకు సరైన రహదారి లేక పారిశ్రామికవేత్తలు ఇక్కట్లు పడుతున్నారు. శివానగర్ గ్రామం మధ్య నుంచి ఎల్‌ఈడీ పార్కుకు వెళ్లేందుకు సింగిల్ రోడ్డు ఉంది. పారిశ్రామిక అవసరాల కోసం భారీ వాహనాల రాకపోకలకు ఇది అనువుగా లేదు. కొడకంచి గ్రామం వైపు ఉన్న మట్టిరోడ్డును అభివృద్ధి చేయాలని ప్రతిపాదించినా అది అటవీశాఖ పరిధిలో ఉండటంతో అనుమతి లభించడం లేదు. ఈ రోడ్డు అభివృద్ధి చేస్తే ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి అనుసంధానం ఏర్పడుతుంది. మూడేళ్లుగా అనుమతుల కోసం ప్రయత్నాలు చేసినా రాలేదు. ప్లాట్ల విక్రయాలు జరిపిన టీజీఐఐసీ సంస్థ రోడ్డు వేయడం లేదని, సమస్యలు పరిష్కరించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ రోడ్డు ఏర్పాటుపై మూడేళ్లుగా జడ్పీ సమావేశాల్లో ప్రతిపాదించినా ఆమోదం లభించలేదని మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్ తెలిపారు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు.

ఈనెల 21న బ్రహ్మాండమైన విడుదల



సంధ్య 35ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
అర్జున్ 70 - కూకట్‌పల్లి కోణార్క్ 70 - దిల్‌సుఖ్‌నగర్



దేవి 70ఎంఎం - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
11.00,2.00,6.00,9.00

వాహనాల వేలం

నారాయణఖేడ్: వివిధ కేసుల్లో సీజ్ అయిన రెండు బైకులను 20న గురువారం ఉదయం 11 గంటలకు ఖేడ్‌లోని ఎక్సైజ్ కార్యాలయం ఆవరణలో వేలం వేయనున్నట్లు స్థానిక ఎక్సైజ్ సీఐ రఘునాథ్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఇసుక టిప్పర్లు సీజ్, ఆరుగురి అరెస్ట్

సంగారెడ్డి క్రైం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఇసుక, మట్టిని అక్రమంగా తరలిస్తున్న ఏడు టిప్పర్లను, నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు సంగారెడ్డి రూరల్ ఎస్‌ఐ రవీందర్ తెలిపారు. ఇస్మాయిల్‌ఖాన్‌పేట నక్కవాగు పరిసర ప్రాంతాల నుంచి అక్రమంగా తరలిస్తున్న టిప్పర్లను, కోకాపేట నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను కంది, హనుమాన్‌నగర్‌లలో మంగళవారం పట్టుకున్నామని తెలిపారు. ఈ ఘటనలో ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవీందర్ తెలిపారు.

ఈనెల 21న బ్రహ్మాండమైన విడుదల



2వ వారం




సుదర్శన్ 35 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.00,6.00,9.00
WATCH & ENJOY PAID PREMIER SHOW 20th MARCH
ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ 8.15AM,11.00PM
ఈనెల 21న బ్రహ్మాండమైన విడుదల



దేవి 70 ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 8.00am
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
మల్లికార్జున 70 - కూకట్‌పల్లి 11.15,6.15
ఇంద్రనాగేంద్ర 70 - కర్నూల్‌ఘాట్ 2.30pm
ఈనెల 21న బ్రహ్మాండమైన విడుదల



సప్తగిరి 70 ఎంఎం - ఎ/సి ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
NTR CINEMAS
ఈనెల 21న బ్రహ్మాండమైన విడుదల



SKY IS THE LIMIT STUDIOS 9391176659
ఈనెల 21న బ్రహ్మాండమైన విడుదల



PARAMJYOTHI FILMS
ఈనెల 21న బ్రహ్మాండమైన విడుదల



PARAMJYOTHI FILMS
ఈనెల 21న బ్రహ్మాండమైన విడుదల



SKML MOTION PICTURES THROUGH GANESH BHARI 9296509333,9299992173

బావిలో పడి వ్యక్తి మృతి



జంగం సందీప్ మృతదేహం

సిద్దిపేట రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన సిద్దిపేట రూరల్ మండలం మాచాపూర్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. సిద్దిపేట రూరల్ ఎస్‌ఐ గూడ అపూర్వ రెడ్డి వివరాల ప్రకారం... రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట గ్రామానికి చెందిన జంగం సందీప్(23) రెండురోజుల కింద మాచాపూర్‌లో బంధువుల ఇంటి గృహ ప్రవేశానికి వచ్చాడు. ఈ క్రమంలో కాలు జారి ప్రమాదవశాత్తు బావిలో పడిపోయాడు. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్‌ఐ అపూర్వరెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి.. గజ ఈతగాళ్లతో బావిలోంచి మృతదేహాన్ని బయటకు తీసి, పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించినట్లు తెలిపారు.

మద్యం మత్తులో యువకుడు..

రాయపోల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో భార్యతో గొడవపడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు, స్టేషన్‌హౌజ్ ఆఫీసర్ కృష్ణం రాజు వివరాల ప్రకారం.. రాయపోల్ గ్రామానికి చెందిన గూని ఎల్లం(40) కొంతకాలంగా మద్యానికి అలవాటుపడ్డాడు. రోజూ తాగి వచ్చి భార్యతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చి భార్యతో గొడవ పడ్డాడు. అనంతరం అందరూ అన్నం తిని పడుకున్నారు. దీంతో ఎల్లం వారి పొలం వద్దకెళ్లి చెట్టుకు ఉరేసుకుని చనిపోయాడు. గమనించిన సమీప బంధువులు కుటుంబసభ్యులకు సమాచారమందించారు. భార్య పిల్లలు అక్కడికి వెళ్లి చూడగా ఎల్లం చెట్టుకు ఉరేసుకుని చనిపోయాడు.

నిజాంపేటలో ఒకరు...

నిజాంపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన నిజాంపేట మండలంలో చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన గగరుగుల రాజు, లలిత దంపతుల కుమారుడు గరుగుల భాను(17) పదో తరగతి పూర్తయిన తర్వాత గ్రామంలో కూలీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం తన తల్లిదండ్రులు ఊరెళ్లిన సమయంలో ఉరేసుకున్నాడు. ఇంటి పక్కన యువకుడు బయటకు వెళ్లడానికి భానును పిలవగా సమాధానం రాలేదు. దీంతో ఇంట్లోకి తొంగి చూసేసరికి వేలాడుతు కనిపించాడు. వెంటనే తలుపులు పగులగొట్టి.. 108 అంబులెన్స్‌కు సమాచారమందిచ్చారు. దుబ్బాకలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోని మృతిచెందినట్లు తెలిపారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

చేగుంట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. చేగుంట మండలం పరిధిలోని పులిమామిడి గ్రామానికి చెందిన పెండాల సునీల్(28) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తన ఇంటి నిర్మాణానికి తెచ్చిన పెయింటింగ్ సామాన్లు మిగిలిపోవడంతో ఇచ్చేందుకు 12న సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండల కేంద్రానికి మిత్రుడితో బైక్‌పై వెళ్లాడు. బోనాల గ్రామ శివారులో రాంగ్‌రూట్‌లో వసుతన్న ఎక్సెల్ ఢీకొనడంతో సునీల్ కిందపడి తలకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబసభ్యులు కొంపల్లిలోని ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి 16న హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మంగళవారం ఉదయం మృతిచెందాడు. మృతుడికి భార్య భవాని, ఐదునెలల పాప ఉన్నది. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

మంజీరాలో యువకుడి మృతదేహం లభ్యం

సంగారెడ్డి క్రైం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మంజీరా డ్యామ్‌లో ఈత కోసం వెళ్లి గల్లంతైన యువకుడి మృతదేహం రెండురోజుల తర్వాత లభ్యమైంది. సంగారెడ్డి రూరల్ ఎస్‌ఐ రవీందర్ వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన అందోల్‌కు చెందిన ఎం.నరేష్(30), దుర్గ భార్యాభర్తలు. నరేష్ డ్రైవర్ పనిచేస్తూ పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో అద్దెకుంటున్నాడు. కాగా 16న నలుగురు స్నేహితులతో కలిసి సంగారెడ్డి మండలం కల్పగూరు శివారులోని మంజీరా డ్యామ్‌లో ఈతకోసం వెళ్లారు. దీంతో నరేష్ నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. మృతుని భార్య దుర్గ ఫిర్యాదు మేరకు సంగారెడ్డి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహం కోసం ఆదివారం రాత్రి, సోమవారం డ్యామ్‌లో వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం పోలీసులు డ్యామ్‌లో గాలించగా నరేష్ మృతదేహం లభ్యమైంది. మృతదేహానికి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ రవీందర్ తెలిపారు.

తల్లీకూతురు అదృశ్యం

మెదక్ అర్బన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : తల్లీకూతురు అదృశ్యమైన సంఘటన మెదక్ పట్టణంలోని బ్రాహ్మణవీధిలో చోటు చేసుకుంది. బ్రాహ్మణవీధికి చెందిన సత్యనారాయణ, విజయలక్ష్మి భార్యాభర్తలు. సోమవారం విజయలక్ష్మి తన కూతురుతో కలిసి బయటకు వెళ్లింది. ఇంటికి వచ్చిన సత్యనారాయణకు ఇద్దరూ కనిపించకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరికైనా కనిపించినచో 8712657878, 8712657913 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని పట్టణ సీఐ నాగరాజు సూచించారు.

విజయవంతమైన 2వ వారం



సంధ్య 70 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
GEETHA FILM DISTRIBUTORS



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మనూచౌదరి, తదితరులు

'ఫైనాన్షియల్ లిటరసీ' ఆవిష్కరణ

సిద్దిపేట కల్చరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి డాక్టర్. గోపాల సుదర్శనం రచించిన ఫైనాన్షియల్ లిటరసీ (ఆర్థిక అక్షరాస్యత) పుస్తకాన్ని కలెక్టర్ మనూచౌదరి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషికి ఆర్థిక అక్షరాస్యత అవసరమన్నారు. నేటి మార్కెట్ కేంద్రీకృత ఆధునిక ప్రపంచములో వ్యక్తుల, సంస్థల, వివిధ విభాగాల ఆదాయ వనరులు సమకూరే దారులు, పద్ధతులు పెరుగుతున్నప్పటికీ, అవసరాలను తీర్చుకునే అంశాలలో ఆర్థిక పరిజ్ఞాన లేమితో వెనుకబడుతున్నారన్నారు. రోజువారీ కనీస అవసరాలను తీర్చుకోలేక తడబడుతూ అప్పులఊబిలో కూరుకుపోతున్నారని, అందుకు ప్రధాన కారణం వారిలో ఆర్థిక అక్షరాస్యత లోపించడమేనని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. జి. సునిత, పుస్తక రచయిత డాక్టరు గోపాల సుదర్శనం, కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టరు అయోధరెడ్డి, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్, డాక్టర్ మామిడాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పయినీరింగ్ మైండ్ సత్యనారాయణ

టాప్‌టెన్ జాబితాలో చోటు



తూప్రాన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పయినీరింగ్ మైండ్స్ ఆఫ్ ఇండియా-2025 జాబితాలో మెదక్ జిల్లా తూప్రాన్ ఎంఈవో, హైస్కూల్ గెజిటెడ్ హెచ్‌ఎం డాక్టర్ పార్వతి సత్యనారాయణకు చోటు లభించింది. పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా కూడా వ్యవహరిస్తున్న ఆయన 35 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నారు. కైట్ క్రాఫ్ట్ ప్రొడక్షన్స్ ఎల్‌ఎల్‌పీ సంకలనం చేసిన ఈ జాబితాలో ఆయన చోటు సంపాదించారు. బోధన, అభ్యాస ప్రక్రియలను మార్చడంలో ఆయన చేసిన కృషికి ఈ గుర్తింపు దక్కింది. ఉపాధ్యాయ సంఘ నేతగా, తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ రాష్ట్ర నేతగా సత్యనారాయణ వ్యవహరిస్తున్నారు. దేశంలోనే టాప్ టెన్ జాబితాలో చోటు సంపాదించిన ఆయనను మండలంలోని ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, విద్యాభిమానులు అభినందిస్తున్నారు.

క్వెస్ట్ టాలెంట్ సెర్చ్‌లో ప్రతిభ



చైత్ర, సతీష్

వర్గల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నిర్వహించిన క్వెస్ట్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్‌లో మండలంలోని నెంటూర్ గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. శ్రీహర్ష టాలెంట్ స్కూల్‌కు చెందిన 6వ తరగతి చదువుతున్న డి. చైత్ర రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించగా, 5వ తరగతి చదువుతున్న ఎల్. సతీష్ జోనల్ లెవల్‌లో మొదటి ర్యాంకు సాధించారు. మంగళవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో వీరికి ప్రశంసా పత్రాలను అందజేశారు. విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులు, టీచర్లు అభినందించారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో..


రికార్డుతో ధ్రువకర్‌రెడ్డి

కౌడిపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పిట్ట కొంచెం కూత ఘనం అన్నచందంగా మూడున్నరేళ్ల చిన్నారి ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కించుకున్నాడు. మండల కేంద్రంలోని పీర్యా తాండలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి కుమారుడు మూడున్నర సంవత్సరాల ధ్రువకర్‌రెడ్డి 46 సెకండ్‌లలో 28 రాష్ట్రాల పేర్లు, రాజధానులు వివరాలను చెప్పడంతో ఇండియా బుక్ ఆఫ్ రికార్డు ఆఫ్ 2025 సర్టిఫికెట్‌ను అందజేశారు. ఫిబ్రవరి 7న ఆన్‌లైన్‌లో ఈ పరీక్ష నిర్వహించి, పేరు నమోదు చేశారు.


గ్రామపంచాయతీల పనితీరు అడిగి తెలుసుకుంటున్న బృందం

కొండాపూర్‌లో రాజస్థాన్ బృందం పర్యటన

కొండాపూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్యాలయ నిర్వహణ, ఉపాధి హామీ పనుల తీరును రాజస్థాన్ ప్రజాప్రతినిధుల బృందం పరిశీలించింది. 21 మంది సభ్యులున్న బృందం మంగళవారం మండలంలోని తొగర్‌పల్లి, అలియాబాద్ గ్రామ పంచాయతీను సందర్శించింది. గ్రామ పంచాయతీలు ఎలా పని చేస్తున్నాయో బృందంలోని అధికారులు ప్రజలు, అధకారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే, ఉపాధి హామీలో కూలీల పనిదినాలు, చెల్లింపులు, చేపట్టిన పనులు వంటి అంశాలు తెలుసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో రాజస్థాన్ టీం అసోసియేట్ మురారీ శర్మ, జెడ్పీ సీఈవో అనిల్‌కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో వీరప్ప, పంచాయతీ కార్యదర్శి నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.


రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

పంటలకు నీరందించండి: బీఆర్‌ఎస్

చేర్యాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలం తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను వెంటనే నింపి, కాలువల ద్వారా పంటలకు నీరు అందించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. చేర్యాల-కొమురవెల్లి ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గీస భిక్షపతి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం తపాస్‌పల్లి రిజర్వాయర్ ఎండిపోయిందని, తద్వారా భూగర్భజలాలు పడిపోయి పంటలు ఎండిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. వెంటనే రిజర్వాయర్‌ను నింపి పంటలు కాపాడుకునేందుకు కాలువల ద్వారా విడుదల చేయాలని, ఎండిపోయిన పంటలకు పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. ఇప్పటికే పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వానికి రైతులపై చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. వెంటనే నీటిని విడుదల చేయకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సిలివేరు సిద్దప్ప, బీఆర్‌ఎస్ నాయకులు కొండా శ్రీధర్, భీమనపల్లి కరుణాకర్, మేరుగు కృష్ణ, కాయిత రాజేందర్‌రెడ్డి, పూడెం గోపాల్‌రెడ్డి, తలారి కిషన్, పులిందార్‌రెడ్డి, పచ్చిమడ్ల స్వామి, ముత్యం నర్సింహులు, భరత్, బొడ్గం వంశీ, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

మెట్ట నేలపై డ్రాగన్‌ఫ్రూట్ సాగు


డ్రాగన్‌ఫ్రూట్స్ ను చూపిస్తున్న బానోతు దుదియా నాయక్

తక్కువ పెట్టుబడి.. అధిక ఆదాయం.. ఆదర్శంగా నిలుస్తున్న కానిస్టేబుల్



అక్కన్నపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అతనో కానిస్టేబుల్. ప్రభుత్వ ఉద్యోగం చేస్తూనే వ్యవసాయంపై ప్రేమతో సేంద్రియ పద్ధతుల్లో సాగు చేస్తున్నాడు. అందరి కంటే భిన్నంగా కొత్తపంట సాగు చేయాలనే ఉద్దేశంతో డ్రాగన్ ఫ్రూట్‌ను తన భూముల్లో పండిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. మెట్టప్రాంతమైన సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం పంతులుతండాకు చెందిన బానోతు దూదియనాయక్ హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వారసత్వంగా తనకు వచ్చిన భూమిలో ఏటా సంప్రదాయ పంటలైన పత్తి, మొక్కజొన్న, వరి, సాగు చేశాడు. అవి దిగుబడి సరిగా రాలేదు. మిత్రుడి సూచన మేరకు మంచి దిగుబడి నిచ్చే పంట వేయడం వ్యయ ప్రయాసలతో కూడుకున్నదిగా భావించి, ఒకసారి వేస్తే దాదాపు 30 సంవత్సరాలకు పైగా ఉండే డ్రాగన్ ఫ్రూట్స్ పంటను ఎంచుకున్నాడు. 2.5 ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్స్ పంటను సాగు చేస్తున్నాడు. ఏడు సంవత్సరాల క్రితం పంట వేయగా పంట వేసిన తర్వాత తొమ్మిది నెలల నుంచి దిగుబడి వస్తోంది. పదిహేను రోజులకొకసారి పంటకు నీటి తడి అందిస్తే సరిపోతుందని, అది వర్షాకాలమైతే అవసరమే లేదని రైతు తెలిపారు. ప్రతి సంవత్సరం 10 నుంచి 18 టన్నుల వరకు పంట దిగుబడి వస్తుందని, పూర్తిగా సేంద్రియ పద్ధతిలోనే సాగు చేస్తున్నట్లు బానోతు దూదియానాయక్ తెలిపారు.

పంట సాగు దశలో ఒకసారి ఎకరాకు రూ.4 నుంచి 5 లక్షలు పెట్టుబడి పెడితే 30 నుంచి 40 సంవత్సరాల వరకు ఎలాంటి పెట్టుబడి లేకుండా ప్రతి సంవత్సరం పంట చేతికి వస్తుంది. పంటలను ఎలాంటి చీడపీడలు ఆశించవని, వన్యప్రాణులు, అడవి జంతువుల వల్ల కూడా ఎలాంటి నష్టం జరగదు. ఇది పూర్తిగా లాభదాయకమైన పంట రైతు పేర్కొంటున్నాడు. ఆరోగ్య రీత్యా అన్ని రకాల విటమిన్లు, పోషక పదార్థాలు ఈ పండులో లభిస్తుండడంతో బయట డ్రాగన్‌ఫ్రూట్స్‌లకు మంచి మార్కెటింగ్ ఉంది. డ్రాగన్‌ఫ్రూట్స్ తోటలో అంతర్ పంటగా మొక్కజొన్నతోపాటు ఇతర పంటలను కూడా వేస్తున్నారు. మెట్ట ప్రాంత రైతులకు ఈ పంట లాభదాయకంగా ఉంటుందని, తమ పంట క్షేత్రం వద్దనే నర్సరీని కూడా ఏర్పాటు చేసి చుట్టూ పక్కల రైతులకు తగిన సలహాలు, సూచనలు ఇస్తూ డ్రాగన్ ఫ్రూట్ మొక్కలను కూడా అందిస్తున్నారు.

మిత్రుడి సలహాతో సాగు



పత్తి, మొక్కజొన్న, వరి, పంటలను సాగు చేస్తే దిగుబడి సరిగా రాక నష్టం వచ్చేది. మిత్రుడి సలహాతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లా పులిపాడుకు వెళ్లి డ్రాగన్ ఫ్రూట్స్ పంట సాగు గురించి తెలుసుకున్నా.. అక్కడి నుంచి మొక్కలను తీసుకువచ్చి సాగు చేశాను. ప్రతి సంవత్సరం మంచి దిగుబడి వస్తుంది. మార్కెట్‌లో డ్రాగన్ ఫ్రూట్స్‌కు డిమాండ్ ఉండడంతో లాభాలు వస్తున్నాయి. పంటకు చీడపీడలు ఆశిస్తాయన్న భయం లేదు. అంతరపంటలు కూడా సాగు చేస్తూ ఆదాయం పొందుతున్నా.. మార్కెట్ సౌకర్యం కూడా బాగుంది. మెట్ట ప్రాంత రైతులకు డ్రాగన్ ఫ్రూట్ సాగు మంచిదే. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చు.

- బానోతు దుదియా నాయక్, కానిస్టేబుల్, పంతులు తండా, అక్కన్నపేట

అసలేం జరుగుతోంది..!

ప్యారానగర్‌పై ప్రభుత్వ అడుగులు ఎటు

42 రోజులుగా ఆగని ప్రజల నిరసనలు

గుట్టుగా పనులు చేస్తున్నారంటూ ఆగ్రహం


ప్యారానగర్ వద్ద పోలీసుల బందోబస్తు

గుమ్మడిదల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మండలంలోని ప్యారానగర్‌లో చేపట్టిన డంపింగ్ యార్డ్ వద్ద అసలేం జరుగుతోంది అంతుపట్టడం లేదు. సిటీలోని చెత్త మొత్తం తెచ్చి తమ మీద పడేస్తే బతకలేమంటూ ఇక్కడి ప్రజలు కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్నా అక్కడ పనులు కొనసాగుతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధి చెత్తను డంప్ చేయడానికి ప్యారానగర్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి పరిసర గ్రామాల వారు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ప్రజల ఆరోగ్యానికి, పరిసరాలకు దీని వల్ల తీరని నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా 42 రోజులుగా జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తున్నా.. ప్రభుత్వం వారి ఆవేదనను పట్టించుకోవడం లేదు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా, రాత్రి సమయంలోనే పనులు ప్రారంభించడం కూడా ప్రజల ఆగ్రహానికి కారణమైంది. ప్రజల నిరసనల మధ్య అక్కడ మాత్రం గుట్టుచప్పుడు కాకుండా పనులు సాగుతున్నాయని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అసలు ప్యారానగర్ విషయంలో ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటోంది.. అసలు ప్రభుత్వ వైఖరి ఏమిటీ అన్న విషయాలు కూడా ఎవరూ చెప్పకపోవడం.. మరో వైపు అక్కడ పనులు సాగుతున్నాయన్న అనుమానాల నేపథ్యంలో మండల ప్రజలు ఆందోళనలు ఉధృతం చేయాలని యోచిస్తున్నట్లు సమాచారం.

పనులు ఆగాయా..?

ప్యారానగర్ డంపింగ్ యార్డ్ విషయంలో హైకోర్టు ఇటీవల మధ్యంతర ఆదేశాలు ఇచ్చింది. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, డంపింగ్ యార్డ్ ప్రాజెక్ట్‌పై సమగ్ర అధ్యయనం చేయాలని స్పష్టం చేసింది. అయితే, ఆదేశాల తర్వాత కూడా రహస్యంగా పనులు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. హైకోర్టు తాత్కాలికంగా పనులు నిలిపివేయాలని ఆదేశించినా, నిర్మాణం పూర్తిగా ఆగిందా లేదా అన్నది ఇప్పటికీ స్పష్టత లేదు. డంపింగ్ యార్డ్ నిర్మాణ స్థలాన్ని కంచెతో చుట్టి బారికేడ్‌లా ఏర్పాటు చేశారు. అక్కడ భారీగా పోలీసులు మోహరించడంతో పోలీస్ పహారా నడుమ అధికారులు పనులు చేస్తున్నారని అనుమానిస్తున్నారు. ప్రజల ఆందోళనకు తలొగ్గి ప్రభుత్వం వెంటనే ప్యారానగర్‌లో డంపింగ్ యార్డ్ పనులు ఆపివేయాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

వాస్తవాలు చెప్పండి



ప్యారానగర్‌లో ప్రభుత్వం నిర్మిస్తున్న దంప్ యార్డ్‌ను ప్రజలంతా వ్యతిరేకిస్తున్నారు. అయినా.. ప్రభుత్వం నుంచి స్పందన లేదు. పనులు నిలిపివేయలని కోర్టు ఆర్డర్ ఇచ్చిన అధికారులు మాత్రం లోలోపల పనులు సాగిస్తున్నారన్నారని ప్రజలు అనుమా నం వ్యక్తం చేస్తున్నారు. నిజానిజాలు ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉంది.

- అమ్మగారి సదనంద్ రెడ్డి, జేఏసీ నాయకులు గుమ్మడిదల

ప్రజల ఇబ్బందులు పట్టవా..



ఈ ప్రాంతంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసి పరిసరాలను కాలుష్యంగా మారుస్తున్నారు. ప్రజల ఆరోగ్యంతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోంది. డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా ఈ ప్రాంత ప్రజలు ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. సుమారు 42 రోజులుగా ఆందోళన చేస్తున్నా మా గోడు ఎవరూ పట్టించుకోవడం లేదు. మా ఓట్లు కావాలి కాని, మా బాధలు పట్టించుకోరా.

-చాపల మధు, నల్లవల్లి గ్రామస్థుడు

తక్షణమే ఎత్తి వేయాలి



పచ్చని పొలాలను ఆనుకుని ఉన్న ఆకుపచ్చని అటవీ ప్రాంతంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసి, అడవిలో చిచ్చు పెడుతున్నారు. దీని వల్ల ఈ ప్రాంతం మొత్తాన్ని కాలుష్యమయంగా మారుస్తున్నారు. నెల రోజుల నుంచి జనమంతా రోడ్డెక్కి నిరసనలు, నిరాహార దీక్షలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ఇక్కడి నుంచి డంపింగ్ యార్డ్‌ను ఎత్తివేయాలి.

- సత్తమ్మ, నల్లవల్లి గ్రామస్థురాలు

ఇంట్లోకి చొరబడి అడవిపంది హల్‌చల్


రఘుపతిరెడ్డి ఇంట్లోకి చొరబడిన అడవిపంది

చేర్యాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలం మర్రిముస్త్యాల గ్రామంలో మంగళవారం రాత్రి ఓ అడవిపంది హల్‌చల్ చేసింది. జనగామ-సిద్దిపేట జాతీయ ప్రధాన రహదారి గుండా అకస్మాత్తుగా జనావాసాలలోకి దూసుకువచ్చింది. చౌరస్తా వద్ద ఉన్న పలువురిని గాయపరుస్తూ గ్రామానికి చెందిన వంగ రఘుపతిరెడ్డి ఇంట్లోకి చొరబడింది. భయాందోళనకు గురైన కుటుంబసభ్యులు అరుస్తూ బయటకు పరుగులు పెట్టారు. తలుపులు మూసివేయడంతో అడవిపంది బయటకు వెళ్లే మార్గం లేక వస్తువులు ధ్వంసం చేసింది. సుమారు అరగంటపాటు ఇంట్లోనే అడవిపంది వీరంగం వేయగా, స్థానికులంతా ఆ ఇంటి ఆవరణకు చేరుకున్నారు. చివరకు పందిని బయటకు వెళ్లగొట్టే క్రమంలో ఇంటి తలుపు ముందు వలవేసి పట్టుకోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అటవీ ప్రాంతం నుంచి ఆ అడవి పంది దారితప్పి గ్రామంలోకి వచ్చినట్లు భావిస్తున్నారు.

భట్టి బడ్జెట్‌పై బోలెడు ఆశలు

5వ పేజీ తరువాయి

అవసరం ఉంది. 30 టీఎంసీల సామర్థ్యం ఉన్న సింగూరు రిజర్వాయర్ తలాపునే ఉన్నప్పటికీ జిల్లాలో పంటలు ఎండిపోతున్నాయి. ఈ ప్రాజెక్టులను నిర్మిస్తే దాదాపు 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది.

కొత్త డివిజన్లు, మండలాల్లో సమస్యలు

ఉమ్మడి మెదక్ జిల్లాను విభజించిన తర్వాత కొత్తగా నర్సాపూర్, తూప్రాన్, జహీరాబాద్, నారాయణఖేడ్, అందోల్, హుస్నాబాద్, గజ్వేల్ రెవెన్యూ డివిజన్లను ఏర్పాటు చేశారు. అదేవిధంగా 20వరకు నూతన మండలాలు ఏర్పాటయ్యాయి. చిన్నగ్రామాలు, తండాలను పంచాయతీలుగా మార్చారు. కాగా హోదాలు పెరిగినప్పటికీ కొత్త డివిజన్లు, మండలాలు, గ్రామపంచాయతీల్లో పరిపాలన పరమైన సమస్యలు ఉన్నాయి. అధికారులను కేటాయించినప్పటికీ సొంత భవనాలు లేకపోయాయి. నిధుల కొరత ఉన్నందునే పరిష్కారం కావడం లేదన్నట్లుగా తెలుస్తోంది. అదే విధంగా సిద్దిపేట జిల్లా చేర్యాల, దుబ్బాక, మెదక్ జిల్లా రామాయంపేట, సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు కేంద్రాలను రెవెన్యూ డివిజన్లుగా మారుస్తామనే హామీలు ఉన్నాయి. వీటి కోసం స్థానికంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

'డబుల్' ఇళ్లకు పరిష్కారమేది?

గత ప్రభుత్వం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించింది. ఇందులో కొన్నింటిని అర్హులకు కేటాయించగా.. చాలా వరకు మిగిలిపోయి ఉన్నాయి. నిర్మాణాలు పూర్తయినప్పటికీ పంపిణీ చేయకపోవడంతో శిథిలావస్థ దశకు చేరుతున్నాయి. సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో దాదాపు 3 వేల డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేయాల్సి ఉంది. ప్రస్తుత ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులు స్వీకరించి పలుచోట్ల అర్హులను గుర్తించి ముందడుగు వేసింది. డబుల్ ఇళ్లకు కూడా నిధులు కేటాయించి పూర్తిచేయిస్తే 3వేల కుటుంబాలకు నీడ దక్కుతుంది. గత ప్రభుత్వం 80 శాతం పనులను పూర్తి చేయించగా మిగతా పనుల కోసం నిధులు అవసరమయ్యాయి. లేదంటే గతంలో వెచ్చించిన నిధులు కూడా వృథా అవుతాయి.

విద్య, వైద్యం, రోడ్లకు నిధులొచ్చేనా?

గురుకులాలకు సొంత భవనాలు అవసరం ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లోనూ చేపట్టిన అభివృద్ధి పనులు సైతం నత్తనడకన నడుస్తున్నాయి. అన్ని నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మించాల్సి ఉంది. ప్రభుత్వ పాఠశాలలను ఆధునికరించడానికి నిధుల కొరత కనిపిస్తోంది. అదే విధంగా మెదక్, సంగారెడ్డిలో ప్రభుత్వ మెడికల్ కళాశాల భవనాలు, అనుబంధ ఆసుపత్రుల నిర్మాణానికి త్వరితగతిన నిధులు కేటాయించాలి. సిద్దిపేటలో నిలిచిన వెయ్యి పడకల ఆసుపత్రిని ప్రారంభించడానికీ నిధుల సమస్యే చూపిస్తున్నారు. ఇదే సిద్దిపేటలో వెటర్నరీ కళాశాల, నర్సింగ్ కళాశాల భవనాలదీ అంతే సంగతి. ఇదిలాఉంటే ఉమ్మడి మెదక్ జిల్లాలో పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ రహదారులను మరమ్మతులు చేయించాల్సి ఉంది. కొత్త రహదారుల ప్రతిపాదనలు పెండింగ్‌లో పడ్డాయి. ఈ బడ్జెట్‌లో నిధుల కేటాయింపుల ఆధారంగానే విద్య, వైద్యం, రహదారుల ప్రగతి సాకారమవుతుంది.

మడూర్‌లో వెయ్యేళ్ల నాటి శిల్పాల గుర్తింపు


మడూరు శివాలయం వద్ద కొత్త చరిత్ర బృందం సభ్యుడు

చిన్నశంకరంపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి మడూరు గ్రామంలోని శివాలయం వద్ద వెయ్యేళ్ల నాటి రాతి శిల్పాలను గుర్తించారు. కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధకుడు బుర్ర సంతోష్ ఆధ్వర్యంలో మంగళవారం పురాతన ఆలయం వద్ద పడి ఉన్న రాతిశిల్పలను పరిశీలించి, అవి రాష్ట్ర కూట కల్యాణి చాణుక్య రాజుల కాలం నాటివని, కాకతీయుల శైలిలో శిల్పాలుగా గుర్తించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్యాణి చాణుక్య రాజుల కాలంలో ఆభరణాలతో చెక్కిన యోగశనమూర్తి విగ్రహం, యోగముద్రలో శేషతల్పంపై ఉన్న విష్ణుమూర్తి, లక్ష్మీదేవి శిల్పాలతో పాటు మరి కొన్ని దేవతామూర్తుల విగ్రహాలను గుర్తించినట్లు వివరించారు. కాకతీయుల్లో చివరి వాడైన రెండు ప్రతాపరుద్రుడు కాలం నాటివని వారు వివరించారు.



పోలీసులకు పట్టుబడిన డీసీఎం వాహనం


బిల్లు లేకుండా పాన్‌మసాలా రవాణా

పట్టుకున్న పోలీసులు.. అప్పటికప్పుడు బిల్లుల సృష్టి

తూప్రాన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): సరైన బిల్లులు లేకుండా పాన్ మసాలా ప్యాకెట్లు రవాణా చేస్తున్న వాహనాన్ని తూప్రాన్ పోలీసులు పట్టుకున్నారు. వాహనం పోలీస్‌స్టేషన్‌కు చేరేలోపే బిల్లులు సృష్టించారు. 200 బ్యాగుల్లో సరుకు పట్టుపడగా, కేవలం 50 బ్యాగులకే బిల్లులు ఉండటంతో పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. తూప్రాన్ ఎస్సై శివానందం కథనం ప్రకారం.. హైదరాబాద్ నుంచి అక్రమంగా పాన్ మసాలా బ్యాగులు రవాణా అవుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్సై శివానందం తన సిబ్బందితో కలిసి తూప్రాన్ పట్టణ పరిధిలోని టోల్‌ప్లాజా వద్ద మంగళవారం వేకువజామున తనిఖీలు చేపట్టారు. తనికల్లో కేఏ01 ఏఎఫ్2391 నంబర్ డీసీఎం వాహనంలో ఎలాంటి బిల్లులు లేకుండా పాన్‌మసాలా బ్యాగుల్లో తరలిస్తున్నారు. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తర్వాత కొందరు సరుకునకు బిల్లులు సృష్టించారు. 200లకుపైగా బ్యాగ్‌ల్లో పాన్‌మసాలా ఉండగా, కేవలం 50 బ్యాగ్‌లకే బిల్లులు తీసుకువచ్చారు. దాంతో పట్టుకున్న వాహనాన్ని మెదక్ కమర్షియల్ అధికారులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మరణవార్త విని స్పృహ తప్పిన తల్లి


స్పృహ తప్పిన తల్లి యాదమ్మ

జోగిపేట రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. విషయం తెలిసి అతని తల్లి స్పృహ తప్పి అపస్మారకస్థితికి చేరుకుంది. ఈ సంఘటన అందోల్ మండలం చింతకుంట శివారులో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జోగిపేట పట్టణానికి చెందిన పెద్దబోయిన సాయికుమార్ (26) చింతకుంట శివారులోని మంజీరా వాగులో చేపలు పట్టేందుకు వలలు వేసి రాత్రి ఇంటికి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణం అయ్యాడు. మార్గమధ్యంలో సాయికుమార్ ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయికుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి ఎస్సై పాండు చేరుకొని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని 108 అంబులెన్స్‌లో జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి పోస్టుమార్టం కోసం తరలించారు.

కొడుకు మృతితో స్పృహ తప్పిన తల్లి

సాయికుమార్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో విషయం తెలిసిన తల్లి యాదమ్మ స్పృహ తప్పి అపస్మారక స్థితికి చేరుకుంది. గారబంగా పెంచుకున్న కొడుకు మంజీరా వాగులో వలలు వేసి వస్తానంటూ ఇంట్లో చెప్పి వెళ్లిన కొడుకు విగత జీవిగా మారడంతో తల్లి యాదమ్మ తట్టుకోలేకపోయింది. స్పృహ తప్పిన యాదమ్మను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.

న్యూస్ బాక్స్

కాళ్లకల్‌లో ఉచిత వైద్య శిబిరం

మనోహరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : కాళ్లకల్ గ్రామంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సొసైటీ కార్యదర్శి శ్రీరామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా 200 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే కొండాపూర్, ముప్పిరెడ్డిపల్లి గ్రామాల్లో కూడా ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెడ్‌క్రాస్ సంస్థ సభ్యులు శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

'చీడపీడల నివారణకు చర్యలు తీసుకోవాలి'

వెల్దుర్తి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : వరిలో చీడపీడల నివారణకు రైతులు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఝాన్సీ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన వెల్దుర్తిలో వ్యవసాయ పొలాలను సందర్శించి రైతులకు పలు సూచనలు ఇచ్చారు. నీటి ఎద్దడి ఉన్న పొలాల్లో ప్రత్యామ్నాయ తడులు ఇచ్చుకుంటూ వరి పంటను కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు మాజీద్‌అలీ, రేవతి, వందన, ఉత్తమ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రేపు తైబజార్ వేలం

చేగుంట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : చేగుంట గ్రామపంచాయతీ కార్యాలయంలో రేపు ఉదయం 10 గంటలకు తైబజార్ వేలంపాట నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి నరేష్ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు గ్రామపంచాయతీలో ముందుగా డిపాజిట్ చేసి వేలంపాటలో పాల్గొనాలని ఆయన తెలిపారు. గ్రామపంచాయతీ నిబంధనలకు లోబడి వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

వరిలో జింక్ లోపాలపై అప్రమత్తత అవసరం

వట్‌పల్లి,మార్చి18(ఆంధ్రజ్యోతి): వరిలో జింక్ లోపాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏడీఏ సత్యనారాయణ అన్నారు. మండల పరిధిలోని బిజిలిపూర్ మంగళవారం వరి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ యాసంగి సీజన్లో వరి పంటకు జింకు సంబంధించిన లోపాలతో తెగుళ్లు వస్తాయని వాటిని నివారించడానికి ఎకరానికి 20 కిలోల చొప్పున దుక్కిలో జింక్ సలిఫైడ్ వేయాలని ఎరువులు నీటి యాజమాన్య పద్ధతిని పాటించాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఏవో శ్రీనివాస్ రెడ్డి ఏఈఓ మహేష్ తదితరులు పాల్గొన్నారు

బ్యాంకు లింకేజీ లేకుండా సబ్సిడీ రుణాలివ్వండి

సంగారెడ్డి రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇచ్చే సబ్సిడీ రుణాల లబ్ధిదారులకు బ్యాంకు లింకేజీ లేకుండా ఇవ్వాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం డిమాండ్ చేశారు. సంగారెడ్డి కలెక్టరేట్ ఏవో పరమేశంకు మంగళవారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. అనంతరం అకారణంగా తొలగించిన గ్రామపంచాయతీ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డీపీవో సాయిబాబాకు వినతిపత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, జిల్లా సహాయ కార్యదర్శి దాసు, శ్రీను, శ్రీనివాస్ ఉన్నారు.

రాజీవ్ యువ వికాస్‌లో దివ్యాంగులకు ప్రాధాన్యం ఇవ్వాలి

వట్‌పల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ యువ వికాస్ పథకంలో దివ్యాంగులకు మొదటి ప్రాధాన్యం ఇచ్చి ఆదుకోవాలని దివ్యాంగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుభాష్, మండలాధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో అంజయ్యకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఉపాధిహామీలో 150 రోజులు పని దినం కల్పించాలని, రేషన్‌కార్డు, అంత్యోదయకార్డులు పంపిణీ చేయాలన్నారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు ప్రారంభం

వట్‌పల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సాయిపేటలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు ఎంపీడీవో అంజయ్య మార్కింగ్ వేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హత కలిగిన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకొని లబ్ధిపొందాలని సూచించారు

స్వయంపాలన దినోత్సవం

పుల్‌కల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలంలోని శివంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం స్వయంపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. ప్రధానోపాధ్యాయురాలిగా సౌమ్య, కలెక్టర్‌గా పవిత్ర, డీఈవోగా మధుకర్, ఎంఈవోగా కిరణ్‌లు వ్యవహరించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి వృత్తి పట్ల తమకున్న అభిమానాన్ని చాటుకోవడంతో ప్రధానోపాధ్యాయురాలు వేదశ్రీ అభినందించారు.

రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా..?

- నిధులు మంజూరైనా మరమ్మతులు కరువు
- రోడ్డు సమస్య పరిష్కరించాలని తండావాసుల వేడుకోలు



కంకర తేలిన పిచేర్యగడితండా రోడ్డు

కోహీర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని పిచేర్యగడి గ్రామపంచాయతీ నుంచి పిచేర్యగడితండా వరకు ఉన్న ఐదు కిలోమీటర్ల తారు రోడ్డు కంకర తేలి అధ్వానంగా మారింది. ఈ రోడ్డు పాడై సంవత్సరాలు గడుస్తున్నా పునర్నిర్మించడంలో అధికారులు చొరవ చూపడం లేదు. తెలంగాణ ఏర్పడక ముందు నిర్మించిన ఈ రోడ్డు ప్రస్తుతం గుల్ల రాళ్లు పేర్చిన మాదిరిగా తయారైంది. ఈ రోడ్డును బాగు చేయాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు తండా గిరిజనులు తెలియజేసినా అధికారుల్లో మాత్రం చలనం కనిపించడం లేదు. గతంలో పిచేర్యగడి గ్రామ పంచాయతీ కింద పిచేర్యగడి(ఎ), పిచేర్యగడి(బి) తండాలు ఉండేవి. అయితే తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రభుత్వం తండాలను గ్రామపంచాయతీలుగా మార్చడంతో పిచేర్యగడితండా(ఎ), పిచేర్యగడితండా(బి)లను ఒకటిగా కలిపి పిచేర్యగడితండా (ఎ)ను గ్రామపంచాయతీగా మార్చారు. ఈ గ్రామపంచాయతీలో దాదాపు 1000 మంది గిరిజనులు ఉంటారు. అయితే వీరు తండా నుంచి మండల కేంద్రానికి రావాలన్నా.. జహీరాబాద్ డివిజన్‌కు వెళ్లాలన్నా ఈరోడ్డే దిక్కు. అయితే ఈ రోడ్డు పాడవడంతో గిరిజనులు నిత్యం నరకయాతన పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులైతే నిత్యం ఏదోచోట పడిపోయి గాయాల పాలవుతున్నారు. ఈ రోడ్డు పాడవడం వల్ల రవాణా సౌకర్యమే లేకుండాపోయింది. ఎలాంటి ఆటోలు, ఆర్టీసీ బస్సులు ఈ తండాను ఎరగవు. రోడ్డును బాగు చేయాలని గిరిజనులు కోరడంతో రెండేళ్ల క్రితం ప్రభుత్వం రూ.1.42 కోట్ల నిధులను మంజూరు చేసింది. అయినా పనులు ప్రారంభించలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును పునర్నిర్మాణం చేసి గిరిపుత్రుల రోడ్డు సమస్యను తీర్చాలని గిరిజనులు కోరుతున్నారు.

అమ్మ దీవెనలు అందరిపై ఉండాలి: ఎమ్మెల్యే



పెద్దమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి



బోనాల ఊరేగింపులో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి

వెల్దుర్తి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : పెద్దమ్మతల్లి దీవెనలు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మండల పరిధిలోని మానేపల్లి గ్రామంలో జరుగుతున్న పెద్దమ్మతల్లి ఆలయ తృతీయ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం గ్రామ దేవతలకు బోనాలు, సాయంత్రం బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఇందులో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి, మాట్లాడారు. గ్రామాల్లో ఆలయ వార్షికోత్సవాలు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని, పెద్దమ్మతల్లి దీవెనలతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అలాగే ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రమేష్‌గౌడ్, నాయకులు ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలకు బోనాలు ప్రతీక

వెల్దుర్తి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : బోనాలు తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని మానేపల్లి పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం నిర్వహించిన బోనాల ఊరేగింపులో పాల్గొని పూజలు నిర్వహించారు. అలాగే లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేష్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పేదలకు వరం

- మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు



చిన్నశంకరంపేటలో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

మెదక్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదలకు వరమని మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు అన్నారు. మంగళవారం చిన్నశంకరంపేట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 52 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్నివర్గాల వారికి సంక్షేమాలు అందుతున్నాయన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజలకు మేలు జరుగలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందన్నారు. అలాగే 15 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సాన సత్యనారాయణ, మాజీ ఎంపీపీలు పాండరిగౌడ్, అరుణ, మాజీ సర్పంచులు రాజిరెడ్డి, వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

డీఏలను విడుదల చేయాలి: నరేందర్



సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్

మెదక్ అర్బన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు బకాయిపడ్డ నాలుగు విడతల డీఏలలో రెండు డీఏలను తక్షణమే విడుదల చేయాలని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం స్థానిక టీఎన్జీవో భవన్‌లో ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యదర్శుల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగులు మూడేళ్లుగా పెరిగిన నిత్యావసర ధరలకనుగుణంగా రావాల్సిన డీఏల కోసం ఎదురుచూస్తూ.. నిరాశ నిస్పృహలతో మనోవేదనకు గురవుతున్నారని చెప్పారు. సంక్షేమ పథకాల పేరుతో ఉద్యోగులు వేతనాలు పొందడం లేదన్నారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అంతకు ముందు పంచాయతీల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బలరాం మాట్లాడుతూ.. గ్రామాలాభివృద్ధి కోసం కార్యదర్శులు తమ వేతనంలోంచి డబ్బులు వెచ్చించి ప్రభుత్వానికి బిల్లులు సమర్పించి ఏడాదిగా ఎదురుచూస్తున్నామన్నారు. పెండింగ్‌లో ఉన్నా బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. అనంతరం ఉద్యోగులకు సభ్యత్వ నమోదు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్, తూప్రాన్ యూనిట్ అధ్యక్షుడు శంకర్‌గౌడ్, ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్, రాకేష్, లింగప్ప, రవి, రజిత, రమేష్, నవీన్, శ్రీకాంత్, వెంకట్రామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ, కళాశాలలో ఎన్నికలు నిర్వహించాలి

- మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి

పాపన్నపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీలతో పాటు అన్ని అనుబంధ డిగ్రీ కళాశాలలో ఇంజనీరింగ్ పాలిటెక్నిక్, ఎంబీబీఎస్ కళాశాలలో విద్యార్థి సంఘాలకు ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించినట్లయితే ధర్నాలు, నిరసనలు తగ్గే అవకాశం ఉంటుందని మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఇటీవల ఉస్మానియా యూనివర్సిటీలో ధర్నా చేస్తున్న విద్యార్థులను అకారణంగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌లో ఉంచడాన్ని తీవ్రంగా ఖండిస్తూ సీఎం రేవంత్‌రెడ్డికి శశిధర్‌రెడ్డి మంగళవారం బహిరంగ లేఖ రాశారు. మార్చి 13న ఓయూ అధికారులకు జారీచేసి సర్క్యులర్‌ను వెంటనే నిలుపుదల చేసి సర్క్యులర్‌ను వాపస్ తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

వార్షిక పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి: డీఈవో



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో రాధాకిషన్

మెదక్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పదో తరగతి వార్షిక పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని మెదక్ డీఈవో రాధాకిషన్ అన్నారు. మంగళవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని కేజీబీవీ, సూరారం గ్రామ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులు ఫేర్‌వెల్‌డేను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 21న జరగనున్న పరీక్షల్లో విద్యార్థులు భయపడకుండా పరీక్షలు రాయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎమ్ సాయిరెడ్డి, ఎస్వో గీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటర్ సెకండియర్ పరీక్షకు 97.83 శాతం హాజరు

సంగారెడ్డి అర్బన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం సెకండియర్ ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా 54 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించారు. 16,477 మందికి 16,119 మంది హాజరుకాగా, 358 మంది గైర్హాజరయ్యారు. 97.83 హాజరు శాతం నమోదైందని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్ తెలిపారు.

ఆర్ఎంపీపై కేసు



మందులను సీజ్ చేస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ చంద్రకళ

శివ్వంపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : అనుమతులు లేకుండా మందులను నిల్వ ఉంచిన ఆర్ఎంపీపై కేసు నమోదు చేసినట్లు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ చంద్రకళ పేర్కొన్నారు. మండల పరిధిలోని కొత్తపేట రూప్లాతండాలోని బాలాజీ ప్రాథమిక చికిత్సాలయంలో లైసెన్స్ లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచిన 30 రకాల మందులను సీజ్ చేశామన్నారు. బాధ్యుడైన ఆర్ఎంపీ పాల్య రాజుపై కేసు నమోదు చేసినట్లు చంద్రకళ తెలిపారు.

సింగూరు కాలువలకు సీసీ లైనింగ్ పనులతో క్రాఫ్ హాలీడే

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నత్తి దశరత్

పుల్‌కల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : సింగూరు ప్రాజెక్టు ఎడమ కాలువకు సిమెంట్ లైనింగ్ పనులు చేపడుతుండటం వల్లనే క్రాఫ్ హాలీడే ప్రకటించారని కాంగ్రెస్ చౌటకూర్ మండల అధ్యక్షుడు నత్తి దశరత్ తెలిపారు. మంగళవారం శివ్వంపేటలో పార్టీ సీనియర్ నాయకుడు కలాలి ఈశ్వర్‌గౌడ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. గిరిజనతండాల్లో పంటలు ఎండిపోతున్నాయంటూ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, బీఆర్ఎస్ నాయకులు పర్యటించడాన్ని వారు తప్పు బట్టారు. సింగూరు ఎడమ కాలువతో పాటు ఇతరత్రా కాలువలను సిమెంట్ లైనింగ్ చేసేందుకు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ ప్రత్యేక చొరవతో నిధులను మంజూరు చేయించారని గుర్తుచేశారు. క్రాఫ్ హాలీడే ప్రకటిస్తున్న విషయాన్ని నీటి పారుదలశాఖ అధికారులతో పాటు పుల్కల్, చౌటకూర్ మండలాల్లోని ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రైతులకు తెలియజేశారని పేర్కొన్నారు.

భారత్ స్కౌట్స్, అండ్ గైడ్స్ కార్యవర్గం ఎన్నిక

మెదక్ అర్బన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : భారత్ స్కౌట్స్, అండ్ గైడ్స్ నూతన జిల్లా కార్యవర్గాన్ని ఏఎస్‌వోసీ వెంకటేశ్వర్లు, డీఈవో రాధాకిషన్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భారత్ స్కౌట్స్, అండ్ గైడ్స్ జిల్లా అధ్యక్షులుగా కలెక్టర్ రాహుల్‌రాజ్, జిల్లా చీఫ్ కమిషనర్‌గా డీఈవో రాధాకిషన్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఇప్ప రాజేందర్‌తోపాటు పలువురి ఎన్నుకున్నారు.

కాలువలు ఏర్పాటు చేసి చెరువులు నింపాలి



చేగుంట గజ్వేల్ రహదారి పై దరాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు

చేగుంట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : రాంపూర్ శివారు వరకు ఏర్పాటుచేసిన కొండ పోచమ్మ ప్రాజెక్టు ద్వారా నీరందించే కాలువలను చిన్నశివనూర్ శివారు వరకు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ చిన్నశివనూర్ గ్రామస్థులు మంగళవారం గజ్వేల్-చేగుంట రహదారిపై ధర్నా చేపట్టారు. కాలువలు లేక చెరువులు ఎండిపోయి భూగర్భ జలాలు అడుగంటి బోర్లు పోయకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రాంపూర్ నుంచి కర్నాల్‌పల్లి, చిన్నశివనూర్ వరకు కెనాల్ కాలువలు ఏర్పాటు చేసి చెరువులు నింపి రైతుల ఇబ్బందులు తీర్చాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెంటనే ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ రఘునందన్ రావు చొరవ తీసుకొని తమ సమస్య పరిష్కారానికి కృషిచేయాలని కోరారు.

అంగన్‌వాడీలతో పనిచేయించుకుని జీతాలు పెంచరా..?

సంగారెడ్డి రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : పాలకులు అంగన్‌వాడీ ఉద్యోగులతో సంవత్సరాల తరబడి పనిచేయించుకుని జీతాలు పెంచరా అని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీలు మంగళవారం చేస్తున్న ధర్నానుద్దేశించి ఆయన మాట్లాడారు. ఐసీడీఎస్‌ను బలోపేతం చేయకుండా కేంద్రం నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. ధరలకనుగుణంగా కనీస వేతనాలు రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, సాయిలు పాల్గొన్నారు.

ఉల్లం'ఘనులు'

5వ పేజీ తరువాయి

సర్వసాధారణంగా మారిపోయింది. దీంతో, ప్రమాదాల బారినపడే అవకాశం ఉన్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఐదు నిమిషాలు వాహనాన్ని పక్కన నిలిపి మాట్లాడితే పోయేదానికి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ద్విచక్ర వాహనదారులు కొందరు పోలీసులకు చిక్కకుండా నంబర్ ప్లేట్ తొలగించడం, నంబర్ కనిపించకుండా బురద, రంగులు వేయడం, చిన్న అక్షరాలతో నంబర్ రాయించడం చేస్తున్నారు. మరికొందరు ట్రిపుల్ రైడింగ్ చేస్తూ వెనుక నంబరు ప్లేట్‌పై బ్యాగులు, బట్టలు వేలాడదీస్తున్నారు.

300 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

- ముగ్గురిపై కేసు



పట్టుకున్న బియ్యం లారీని చూపుతున్న ఎస్ఐ సుభాష్‌గౌడ్

మనోహరాబాద్/సంగారెడ్డి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా రవాణా చేస్తున్న 300 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్న సంఘటన మంగళవారం చోటు చేసుకున్నది. ఎస్ఐ సుభాష్‌గౌడ్ వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కూచారం 44వ జాతీయ రహదారి పక్కన పంజాబీ దాబా వద్ద హైదరాబాద్ నుంచి నాగపూర్ వైపు వెళ్తున్న వాహనాన్ని పోలీసులు తనిఖీ చేశారు. దీంతో లారీలో 300 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉండడంతో పట్టుకుని మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై డ్రైవర్ షేక్ మోహిత్‌ను విచారించగా.. శ్రీశైలం నుంచి మహారాష్ట్రకు వెళ్తున్నానని చెప్పాడు. అనంతరం లారీ యజమాని, డ్రైవర్, బియ్యం తరలిస్తున్న యజమానిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. కాగా పట్టుకున్న బియ్యాన్ని ఎంఎల్ఎస్ గోదాంకు తరలించామన్నారు. అలాగే చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద వ్యాపారి శ్రీనివాస్ ఇంట్లో అక్రంగా నిల్వ ఉంచిన 25.70 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని టాస్‌ఫోర్స్ రెవెన్యూ అధికారులు, ఎస్ఐ నారాయణగౌడ్ మంగళవారం పట్టుకున్నారు.

ఈపీఎఫ్ కనీస పెన్షన్‌ను రూ.5 వేలకు పెంచాలి

- బీఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రదీప్‌కుమార్

సంగారెడ్డి అర్బన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఈపీఎఫ్ 95 కనీస పెన్షన్‌ను రూ.5 వేలకు పెంచాలని బీఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రదీప్‌కుమార్ డిమాండ్ చేశారు. సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించి మాట్లాడారు. ఈపీఎఫ్ 95 పెన్షన్ స్కీమ ప్రారంభమై 30 ఏళ్లు దాటినా కనీస పెన్షన్ రూ.1000 నుంచి పెరగలేదని విమర్శించారు. కనీస పెన్షన్ ఐదు వేలకు పెంచి డీఏతో కలిపి ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి, కార్యదర్శి మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆలయ వార్షికోత్సవం

సంగారెడ్డి రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మండలం ఈశ్వరాపురం (ఇస్మాయిల్‌ఖాన్‌పేట) గ్రామంలోని దుర్గా భవానీ మహా క్షేత్రం ఆలయ 24వ వార్షికోత్సవం కనుల పండువగా సాగుతోంది. ఆలయ ధర్మాధికారి రాధాకృష్ణమూర్తిశర్మ పర్యవేక్షణలో అమ్మవారిని ఆలయ ప్రధాన అర్చకులు రవికుమార్‌శర్మ, దత్తాత్రేయశర్మ నూతన వస్త్రాలు, పూలమాలలతో ముస్తాబు చేశారు. మూడోరోజైన మంగళవారం వేదపండితులు, ఋత్వికులతో చతుర్వేద స్వాహకారము, శకచండీ పారాయణము, లక్ష కుంకుమార్చన, సామూహిక కుంకుమార్చన, సహస్రలింగార్చన తదదితర ప్రత్యేక పూజలు చేశారు. వేడుకలకు వచ్చే భక్తులకు ఎండలను దృష్టిలో పెట్టుకుని మజ్జిగ వితరణ చేశారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ నిర్వాహకులు అన్న ప్రసాద వితరణ చేశారు.

ఐదోరోజుకు చేరిన ఎమ్మార్పీఎస్ దీక్షలు

మెదక్ కల్చరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీల వర్గీకరణ అమలు కోసం మెదక్ రామ్ దాస్ చౌరస్తా వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్ష మంగళవారం ఐదోరోజుకు చేరింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అమలు ఈ పరిస్థితుల్లో చేయకపోతే గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 నియామకాల్లో ఏబీసీడీల్లో డీ లేకుండా మాదిగ ఉపకులాల మాదిగలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి తప్పట్ల రమేష్‌మాదిగ, అస్త్రగాళ్ల బాలరాజ్, సామెల్, మెదక్ పట్టణ నాయకులు పాల్గొన్నారు.

యూనిఫాం కుట్టేందుకు మహిళా సంఘాలకు శిక్షణ

సంగారెడ్డి రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల యూనిఫాంలు కుట్టేందుకు హైదరాబాద్‌లో మంగళవారం మహిళా సంఘాల సభ్యులకు ఏపీఎం వెంకట్ అధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకటవ తరగతి నుంచి 7వ తరగతి విద్యార్థులకు నిక్కర్, షర్ట్, 8వ తరగతి నుంచి ఇంటర్ సెకండ్ ఇయర్ వరకు ప్యాంటు, షర్ట్ అదేవిధంగా 1వ తరగతి నుంచి మూడవ తరగతి వరకు విద్యార్థినులకు ఫ్రాక్, షర్ట్, 4, 5వ తరగతుల విద్యార్థులకు స్కర్టు, షర్ట్, 6వ తదరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినులకు బాటమ్, టాప్ తరగతుల వారిగా కొలత తీసుకుని సరైన సమయానికి కుట్టి అందించాలన్నారు. ఇందులో సమత, సీసీలు సునీత, శశికళ, సంతోష, కల్పన పాల్గొన్నారు.

నైపుణ్యం పెంపొందించేందుకు శిక్షణ దోహదం

నర్సాపూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మారుతున్న కాలానుగుణంగా ఫార్మాసిస్టులు నైపుణ్యం పొందడానికి ఈ శిక్షణ ఎంతో దోహదపడుతుందని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ డ్రగ్ కంట్రోలర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం నర్సాపూర్ సమీపంలోని విష్ణు ఫార్మసీ కాలేజీలో నాలుగురోజుల పాటు ఫార్మాసిస్టులకు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఫార్మారంగం రోజురోజుకు ఎంతో అభివృద్ధి చెందుతుందని, దానికి తగ్గట్టు ఫార్మాసిస్టులకు ఈ శిక్షణ ఎంతో దోహదపడుతుందన్నారు.

ఘనంగా అగ్నిగుండాలు, బోనాలు

కౌడిపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తునికి నల్లపోచమ్మ ఆలయం వద్ద నాలుగురోజుల జాతరలో భాగంగా మంగళవారం అగ్నిగుండాలు, బోనాల కార్యక్రమం జరిగింది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో రంగారావు, సీనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. బుధవారం ఎడ్లబండ్ల ప్రదర్శన ఉండటంతో భక్తులు పెద్దఎత్తున రానున్న నేపథ్యంలో కౌడిపల్లి ఎస్ఐ రంజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు చేపడుతున్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే ట్విన్నింగ్ ప్రోగ్రాం

వెల్దుర్తి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే ట్విన్నింగ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని ఎంఈవో యాదగిరి అన్నారు. వెల్దుర్తి ఉన్నత పాఠశాల హెచ్ఎం సాంబయ్య ఆధ్వర్యంలో మంగళవారం వెల్దుర్తి ఉన్నత పాఠశాలలోని 6 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు కుకునూర్, యశ్వంతరావుపేట, అందుగులపల్లి పాఠశాలకు తరలివెళ్లి పాఠశాలలో జరుగుతున్న కార్యక్రమాలను తిలకించారు. అలాగే మహ్మద్‌నగర్‌తండాలో గల పట్టుపురుగుల కేంద్రాన్ని విద్యార్థులు సందర్శించారు.

'ఆత్మస్థైర్యంతో ముందుకుసాగాలి: ఎంఈవో

పెద్దశంకరంపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల విద్యార్థులు అధైర్యపడకుండా ఆత్మస్థైర్యంతో ముందుకుసాగాలని ఎంఈవో వెంకటేశం అన్నారు. మంగళవారం పెద్దశంకరంపేటలోని భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు సహాయ ఉపకరణాలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.